RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 336 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 01-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్య పద్యం

ఆటవెలది

కలముపట్టి కవులు జేయు కవనములను
సకలప్రాణులకును రైతు కడుపునింపు
కలరు రాజులు పుడమిన కాపుగాయ
కలము,హలము,కత్తులనెల్ల కలిగి వారు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

## ప్రజాస్వామ్య పద్ధతిలో మూసీ పునరుజ్జీవం పనులు

- 15 రోజులు ప్రజాభిప్రాయాలు స్వీకరిస్తాం
- వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం
- విలువైన సూచనలిచ్చిన వారితో 'సబ్ కమిటీ' సమావేశం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్

మూసీ పునరుజ్జీవం పనులను ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగిస్తామని డిప్యూటీ సీఎం, మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మూసీ క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రి పొన్నం ప్రభా కర్‌తో కలిసి మూసీ పునరుజ్జీవం పనుల పురోగతిపై అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మూసీనది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయ పనులకు మార్చి 28న శంకుస్థాపన చేశామని తెలిపారు. అప్పటి నుంచి మూసీ ఫేస్-1, ఫేస్-2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన -మిగతా 2 లో



## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

- ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు
- అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు
- మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత

తిరువనంతపురం,

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య -మిగతా 2 లో



## గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ విక్టరీ

- 3 వికెట్ల తేడాతో విజయం సాధించిన పంజాబ్
- అజేయ హాఫ్ సెంచరీ చేసిన కూపర్ కన్నోలీ
- బౌలింగ్‌లో రాణించిన ప్రసిధ్ కృష్ణ

న్యూ ఛండీగడ్:

ఐపిఎల్ సీజన్-19లో పంజాబ్ కింగ్స్ బోణీ కొట్టింది. మహారాజ యదవింద్రసింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు మూడు వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 162 పరుగులు చేయగా.. అనంతరం పంజాబ్ కింగ్స్ 19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 165పరుగులు చేసి విజయం సాధించింది. ఛేదనలో భాగంగా పంజాబ్ కింగ్ బ్యాటర్ కూపర్ కనోలీ(72నాటౌట్) చివరి వరకు క్రీజ్‌లో ఆ జట్టుకు విజయాన్నందించాడు. ప్రభ్ సిమ్రన్(37), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(17) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు ప్రసిధ్ కృష్ణకు మూడు, -మిగతా 2 లో



## బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

- నా ముఖం చూసి మాత్రమే ఓటేయండి
- సెంటిమెంట్ మాటలతో మమత ప్రచారం

కోల్‌కతా,

భారతీయ జనతా పార్టీ పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. బీజేపీని 'అనాగరిక' పార్టీగా అభివర్ణించారు. దేశంలోని బెంగాలీ మాట్లాడే వలస కార్మికులను టార్గెట్ చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వారిని వేధింపులు, అవమానాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బాంకురాలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మమతా బెనర్జీ ప్రసంగించారు. టీఎంసీ అభ్యర్థులు ఎవరనేది కాకుండా తన నాయకత్వాన్ని మాత్రమే చూడాలని ఈ సందర్భంగా ఓటర్లను మమతాబెనర్జీ కోరారు. 294 నియోజకవర్గాల్లోనే తననే అభ్యర్థిగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితాలో అవకతలను ప్రధానంగా ఆమె తన ప్రసంగంలో ప్రస్తావిస్తూ, ఒకేరోజు 30,000 అప్లికేషన్లు దాఖలైనట్టు పార్టీ నేత అభిషేక్ బెనర్జీ వద్ద సమాచారం ఉందని తెలిపారు. బెంగాల్ ఎన్నికల ఫలితాలను -మిగతా 2 లో

## న్యూక్లియర్ రేస్!




- పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అణ్వాయుధాల కోసం పోటాపోటీ
- అణు విధానంపై మారుతున్న ప్రపంచ దేశాల వైఖరి
- రక్షణ కవచంగా అణ్వాయుధాలను వాడుకోవాలని యోచన

న్యూఢిల్లీ,

ఏడాది కాలంలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ రెండుసార్లు దాడి చేశాయి. ఈ రెండు దాడులకు మూల కారణం ఇరాన్‌కు అణ్వాయుధాలను తయారుచేయగల సామర్థ్యం ఉండడమే. దీన్ని అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ముప్పుగా పరిగణిస్తున్నాయి. ఇరాన్‌లో ఇప్పుడు ఐదవ వారంలోకి ప్రవేశించిన, ముగింపు కనిపించని సైనిక దాడి -మిగతా 2 లో

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

## కాంగ్రెస్, బీజేపీది ఫెవికాల్ బంధం



- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలు అభ్యంతరకరం
- ఆరు గ్యారంటీల అమలుపై స్పష్టత కరువు
- దిశానిర్దేశం లేకుండా ముగిసిన అసెంబ్లీ సమావేశాలు
- రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలి
- పొంగులేటి అవినీతిని బయటపెట్టినందుకే మా ఎమ్మెల్యేల సస్పెన్షన్

: మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం పగబట్టిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో రైతులకు శిక్ష వేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ మీద ద్వేషం ఉంటే తమకు శిక్ష వేయాలనీ, రైతుల పొట్ట కొట్టొద్దని కోరారు. తక్షణమే నిధులను విడుదల చేసి కాలువలకు నీళ్లు -మిగతా 2 లో



## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

- బంకర్ బస్టర్లతో అమెరికా విధ్వంసం
- దుబాయ్‌లో కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హార్ముజ్‌లో టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర
- 'ధైర్యం చూపండి..చమురు తెచ్చుకోండి' : రెచ్చగొడుతున్న ట్రంప్
- అమెరికా అధ్యక్షుల మెహర్బానీ కోసం గల్ఫ్ దేశాల వెంపర్లాట

టెహ్రాన్:

ఇరాన్‌లో అణుకేంద్రాలు కలిగి ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో భీకర స్థాయిలో విరుచుకుపడింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఈ విషయాన్ని పేర్కొంది. మరోపక్క ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా- ఇజ్రాయిల్ దాడులకు పాల్పడ్డాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. -మిగతా 2 లో



## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

- ఇక శాశ్వత రాజధానిగా అమరావతి
- ఇది తెలుగువారికి ఎంతో గర్వకారణం
- టిడిపి ఎంపిలు కృష్ణదేవరాయలు, కలిశెట్టి

న్యూఢిల్లీ

రాష్ట్ర ప్రజలకు శాశ్వత రాజధానిగా అమరావతి ఉంటుందని లోక్‌సభలో టీడీపీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. అమరావతి తీర్మానం లోక్‌సభ ఆమోదం తరవాత ఇక ప్రజల రాజధానిగా అమరావతి వెలుగొందుతుందని అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లును ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. ఈ బిల్లు ద్వారా రాజధాని రైతులకి మరింత భరోసా వస్తోందని ఆయన -మిగతా 2 లో

## ఐదు రోజులు వానలు



- ఉదయం ఉక్కపోత సాయంత్రం ఈదురుగాలులు
- రాష్ట్రంలో ఆరెంజ్ అలర్ట్ జారీ

: వాతావరణ శాఖ

హైదరాబాద్

ద్రోణి, గాలి అనిశ్చితితో పాటు ఉపరితల చక్రవాకం ప్రభావంతో రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు బుధవారం ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందనీ, రాత్రి వేళల్లో ఉక్కపోత వాతావరణం ఉంటుందని పేర్కొంది

## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

- పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
- ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,

తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి -మిగతా 2 లో

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

మొదటి తరువాయి

జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ-లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

## బెంగాలీలను బీజేపీ అవమానం చేస్తోంది

మొదటి తరువాయి

ప్రభావితం చేసేందుకు బిహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఓటర్లను బీజేపీ దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని ఆరోపించారు. 'బిహార్‌లో చేసినట్టుగానే రైల్వేలను ఉపయోగించుకుని బయట ప్రాంతాల నుంచి ఓటర్లను రప్పించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది' అని అన్నారు. భారత ఎన్నికల కమిషన్‌పై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ చెప్పినట్టు ఈసీఐ నడుచుకుంటోందని, బీజేపీ-ఈసీ కలిసి ప్రజాస్వామిక, రాజ్యాంగ హక్కులను ఊడలాక్కుంటాయని ఆరోపించారు. ఓటర్ల లిస్ట్‌లో కొందరిని టా÷-గ్గ÷ట్ చేసి తొలగించడం, మరికొందరిని జాబితాలో చేర్చడం జరుగుతోందన్నారు. తప్పుడు ఫారం-6 అప్లికేషన్లతో బీహార్ ఓటర్ల జాబితాలో చేరేందుకు ప్రయత్నించిన పలువురు బీజేపీ కార్యకర్తలు పట్టుబడినట్టు చెప్పారు. ఇది కేవలం ఓటర్ల హైజాకింగ్ కిందకే వస్తుందన్నారు. చట్టబద్ధత కలిగిన 60 లక్షల అప్లికేషన్లు ఇప్పటికే పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. బల్క్ ఎంట్రీలను మాత్రం ఫాస్ట్ ట్రాక్ చేస్తున్నారని అన్నారు. ఇదెంతమాత్రం రొటీన్ ప్రక్రియ కాదని, స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడంపై జరుగుతున్న దాడి అని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో మాంసాహారంపై నిషేధం విధిస్తుందని, దొడ్డిదారిన ఎన్ఆర్సీ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సాంస్కృతిక ఆంక్షలు, వివాదాస్పద విధానాలు అవలంబిస్తోందని అన్నారు.

## మూసీపై ఆన్‌లైన్లో ప్రజాభిప్రాయ సేకరణ

మొదటి తరువాయి

రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో ఎబరఊతీసషఏస్త్రఝఊశ్రీ.షశీఎ మెయిల్ ఐడీ ద్వారా ప్రజల అభిప్రాయాలను స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను వ్యక్తం చేసిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని తెలిపారు. డిఫెన్స్ భూములు, మూసీ బాధితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్‌తో మాట్లాడటం ఇలా ఎక్కడికక్కడ పనులను విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి, యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకుని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని చెప్పారు. అందరి జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతోందని సూచించారు. అధికారులకు ఎలాంటి సలహాలు, సూచనలతోపాటు ఏ ఇతర అవసరాలున్నప్పటికీ మూసీ సబ్ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. ఆ కమిటీ సభ్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డీ నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినరు కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మనుచౌదరి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్ఫహాన్‌పై బాంబుల వర్షం

మొదటి తరువాయి

దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడ్డాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే..ఇరాన్‌లో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను కూల్చేశాం: ఐఆర్‌జీసీ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తయారుచేసిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. ఐఆర్‌జీసీ అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇస్ఫహాన్ ప్రాంతంలో ఎగురుతున్న ఈ డ్రోన్‌ను ధ్వంసం చేసినట్టు ఐఆర్‌జీసీ వర్గాలు పేర్కొన్నాయి.

**హార్ముజ్‌లో టోల్ వసూల్ : ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ ఆమోదముద్ర**

ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్రమార్గాల్లో ఒకటైన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ వసూలుకు ఇరాన్ పార్లమెంట్ గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి హార్ముజ్ నిర్వహణ ప్రణాళికకు పార్లమెంటరీ భద్రతా కమిటీ ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం ఈ మార్గం గుండా ప్రయాణించే నౌకలు ఇకపై ఇరాన్ కరెన్సీ 'రియాల్' రూపంలో టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రణాళికలో భాగంగా ఆర్థికపరమైన అంశాలే కాకుండా, జలసంధి భద్రత, పర్యావరణ పరిరక్షణ, నౌకల భద్రత బాధ్యతలను ఇరాన్ తన పరిధిలోకి తీసుకుంది. అమెరికా-ఇజ్రాయిల్ నౌకలు ఈ జలసంధి గుండా ప్రయాణించడాన్ని ఇరాన్ పార్లమెంట్ పూర్తిగా నిషేధించింది. అలాగే ఇరాన్‌పై ఏకపక్షంగా ఆంక్షలు విధించే దేశాల నౌకలకు కూడా అనుమతి నిరాకరించాలని నిర్ణయించింది. ఈ వ్యూహాత్మక జలసంధిపై తన సార్వభౌమత్వాన్ని చాటుకుంటూనే ఆదాయాన్ని పెంచుకోవాలని ఇరాన్ యోచిస్తోంది. ప్రపంచ ముడిచమురు సరఫరాలో ఐదో వంతు జరిగే ఈ మార్గం అంతర్జాతీయ జలాల పరిధిలోకి వస్తుందని అమెరికా సహా పలు దేశాలు చెబుతున్నాయి. అక్కడ టోల్ వసూలుకు ఇరాన్‌కు చట్టబద్ధత లేదని పేర్కొంటున్నాయి.

# గుజరాత్ టైటాన్స్‌పై పంజాబ్ కింగ్స్ విక్టరీ

మొదటి తరువాయి

రబాడా, అశోక్ శర్మ, రషీద్ ఖాన్, సుందర్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు పంజాబ్ కింగ్స్ బౌలర్లు వ్యాషక్, చాహల్ దెబ్బకు గుజరాత్ టైటాన్స్ స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. 2025 సీజన్ రన్నరప్ పంజాబ్ బౌలర్లు ప్రారంభం నుంచే గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(39), జోస్ బట్లర్ (38) మాత్రమే రాణించడంతో గుజరాత్ ఆమాత్రమైనా స్కోర్ చేయగల్గింది. బట్లర్ ఔటయ్యాక గుజరాత్ బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు సాయి సుదర్శన్(13), శుభ్‌మన్ గిల్(39)లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయి సుదర్శన్‌ను ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేక్ ఇవ్వగా.. జోస్ బట్లర్(38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో గిల్ ఔటవ్వడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు. అయితే.. విజరుకుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా



బంతులు విసిరి వాషింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)కు బ్యాటింగ్‌కు అడ్డుగా నిలిచారు.. దీంతో గుజరాత్ 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది.

స్కోర్‌బోర్డు...

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి)శ్రేయస్ (బి)యాన్సెన్ 13, గిల్ (సి)కనోలే (బి)చాహల్ 39, బట్లర్ (సి)బార్ట్‌లెట్ (బి)చాహల్ 38, ఫిలిప్స్ (సి)యాన్సెన్ (బి)వ్యాషక్ 25, సుందర్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 18, షారుక్ ఖాన్ (సి)అర్ష్‌దీప్ (బి)వ్యాషక్ 4, తెవాటియా (నాటౌట్) 11, రషీద్ ఖాన్ (నాటౌట్) 0, అదనం 14. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 162పరుగులు.

వికెట్ల పతనం: 1/37, 2/83, 3/119, 4/129, 5/144, 6/150.

బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-42-0, బార్ట్‌లెట్ 4-0-36-0, యాన్సెన్ 4-0-20-1, వ్యాషక్ 4-0-34-3, చాహల్ 4-0-28-2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ ఆర్యా (సి)అశోక్ శర్మ (బి)రబాడా 7, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)ప్రసిద్ కృష్ణ (బి)రషీద్ ఖాన్ 37, కనోలే (నాటౌట్) 72, శ్రేయస్ అయ్యర్ (సి)సుందర్ (బి)ప్రసిధ్ 18, వధేరా (సి)గిల్ (బి)సుందర్ 3, శశాంక్ సింగ్ (సి)బట్లర్ (బి)ప్రసిధ్ కృష్ణ 4, స్టొయినీస్ (సి)రషీద్ ఖాన్ (బి)ప్రసిధ్ కృష్ణ 0, యాన్సెన్ (సి)గిల్ (బి)అశోక్ శర్మ 9, బార్ట్‌లెట్(నాటౌట్) 11, అదనం 4. (19.1ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 165పరుగులు.

వికెట్ల పతనం: 1/7, 2/83, 3/110, 4/113, 5/118, 6/118, 7/144.

బౌలింగ్: సిరాజ్ 2-0-15-0, రబడా 3-0-34-1, అశోక్ శర్మ 3-0-31-1, రషీద్ ఖాన్ 4-0-29-1, సుందర్ 3.1-0-27-1, ప్రసిధ్ కృష్ణ 4-0-29-3.

# న్యూక్లియర్ రేస్!

మొదటి తరువాయి

ప్రపంచవ్యాప్తంగా అణు పోటీ అనే భూతాన్ని చెరవిముక్తి చేసినట్లుగా కనిపిస్తున్నది. పాలన మార్పు, అణు కార్యక్రమం ముగింపును తెచ్చే ఉద్దేశంతో ఇరాన్‌పై జరిగిన దాడులు యూరప్ నుంచి తూర్పు ఆసియా వరకు అన్ని దేశాలు ఇప్పుడు తమ అణు విధానంపై పునరాలోచించే పరిస్థితిని కల్పించాయి. శక్తివంతమైన మిత్రదేశాలపై ఆధారపడే బదులు సొంతంగా అణ్వాయుధాలు నిర్మించుకోవాలని చాలా దేశాలు యోచిస్తున్నాయి.

ఒకప్పుడు అమెరికా అణు ఛత్రం కింద తాము సురక్షితమని భావించిన దేశాలు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ పాలనలో అమెరికా తీసుకునే నిర్ణయాలు అనూహ్యంగా ఉన్న నేపథ్యంలో సొంత ప్రత్యామ్నాయాలపైనే ఆధారపడేందుకు మొగ్గుచూపుతున్నాయి. అణ్వాయుధాల దాడికి గురైన ఏకైక దేశమైన శాంతికాముక జపాన్ సైతం ఇప్పుడు సొంతంగా అణ్వాయుధాల నిర్మాణం గురించి ఆలోచిస్తున్నది. చైనా, రష్యాతో పోటీపడాలని అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన ఆదేశాలతో 33 ఏండ్ల విరామం తర్వాత తాను కూడా అణు పరీక్ష



పునరుద్ధరించాలన్న ఆసక్తిని గత నవంబర్‌లో అమెరికా వ్యక్తం చేసింది.

**ఇరాన్ యుద్ధంతో ఆందోళనలు**

ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించుకుంటే తాము కూడా అణ్వాయుధ సామర్థ్యాన్ని సాధిస్తామని సౌదీ అధికారులు చాలాకాలంగా చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో పాక్, సౌదీ ఓ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. తమ అణ్వయుధాలు అవసరమైతే సౌదీకి కూడా అందుబాటులో ఉంటాయని పాక్ ఆ తర్వాత ప్రకటించింది. మరో పక్క నాటో సభ్య దేశమైన తుర్కియే తన సొంత అణు నిరోధక శక్తి కోసం అన్వేషిస్తున్నది. ఇరాన్ మరింత బలపడితే ఈ ప్రాంతంలోని అధికార సమతుల్యతను దెబ్బతీస్తుందన్న భయమే తుర్కియే ఆందోళనకు కారణం. లిబియా, ఉక్రెయిన్ విషయంలో చూసినట్లుగా అణ్వాయుధ కవచం లేని దేశాలు దాడుల నుంచి అధిక ప్రమాదాన్ని ఎలా ఎదుర్కొంటాయో ఇరాన్‌పై జరిగిన దాడి తెలియచేస్తుంది. అణ్వాయుధాలు కలిగి ఉండటం ఇంటి గేటు దగ్గర ఒక డాబర్‌మాన్ శునకాన్ని కాపలాగా ఉంచుకోవడం లాంటిది. చొరబాటుదారులను భయపెట్టి తరిమివేయడానికి అది బాగా పనిచేస్తుంది. అణ్వాయుధాల నిల్వలను కలిగి ఉన్న ఉత్తర కొరియా సరిగ్గా ఇదే కారణంతో బాహ్య జోక్యాన్ని చాలా వరకు నిరోధించగలిగిందని నిపుణులు తెలిపారు.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ పగ

మొదటి తరువాయి

వదలాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన వ్యాఖ్యలు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయనీ, బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.90 వేల కోట్లు, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడటం తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకకరాల్లో ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని వివరించారు. భువనగిరి జిల్లాలో ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు కాలువలకు వెళ్లి నీళ్లు వదులుతున్నారనీ,అవి కాళేశ్వరం నీళ్లు కావా?అని ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారనీ, అది కాళేశ్వరంలో భాగం కాదా? అని అడిగారు. హైదరాబాద్‌కు తాగునీటి కోసం మూసీ పక్కనుంచి 20 టీఎంసీల నీళు తేవడం కోసం రూ.ఎనిమిది వేల కోట్లతో కాలువలు తవ్వుతున్నారనీ, మల్లన్న సాగర్ నుంచి ఆ నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భువనగిరి, చొప్పదండి, జగిత్యాల, సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్ వెళ్లి సాగునీటిని, పంటలను చూద్దామనీ, నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో రైతులను అడుగుదామని కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, కిషన్‌రెడ్డి, బండి సంజరుతోపాటు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. రూ.50 కోట్లు విడుదల చేస్తే కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులివ్వకుండా పగబట్టిందని విమర్శించారు.

## ఉచిత బస్సుతో మహిళలకు మేలు

మొదటి తరువాయి

పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.

## నేడు పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

మొదటి తరువాయి

విశ్వాసం వ్యక్తం చేశారు. రైతులు నమ్మకంతోనే.. రాజధానికి భూములు ఇచ్చారన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులను కేంద్రం అర్థం చేసుకుందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వం రాజధానిని అడ్డుకోవాలని చూసిందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి రాజధానికి 30 వేల ఎకరాలని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మాట మార్చారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చినా? రాకున్నా రాష్ట్ర ప్రజలు పట్టించుకోరని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలకు రాజధానిపై అసలు స్పష్టత లేదని విమర్శించారు. రాజధాని అమరావతికి తాము వ్యతిరేకం కాదని వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన విషయాన్ని ఎంపీ లావు గుర్తు చేశారు. వైసీపీ నేతలు ఒక్కొక్కరు ఒక్కో విధంగా రాజధానిపై మాట్లాడుతున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు రైతులకు మాట ఇచ్చారని.. ఇప్పుడు దానిని నిలబెట్టుకున్నారని వివరించారు. ఏపీ పునర్విభజన చట్టంపై తాను పార్లమెంట్‌లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా మాట్లాడానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గుర్తు చేశారు. లోక్ సభకు రాజధాని అమరావతి బిల్లు రాబోతుందని.. ఇది ఒక ఆంధ్రుడిగా తనకు గర్వంగా ఉందని విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు తెలిపారు. అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారని వివరించారు. 2014లో సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు ఇస్తే రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడ ఇలా జరగలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూసేకరణ చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగిందని.. రాజధాని సైతం వారి హయంలోనే గుర్తిస్తున్నారని ఎంపీ అప్పలనాయుడు వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో కుట్రలు చేశారని విమర్శించారు. వైసీపీ నేతలు సైతం రాజధాని నిర్మాణం జరగకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది చెంపపెట్టు అన్నారు. రాజధాని అమరావతిపై జగన్ తన వక్రబుద్ధి చూపించారని చెప్పారు. అమరావతి బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపిందన్నారు.

## ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యా సమీక్ష కేంద్రాల బలోపేతం



**గంగాధర, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో ప్రజా పాలన ప్రగతి నివేదికలో భాగంగా మార్చి 30 నుండి ఏప్రిల్ 5 వరకు పాఠశాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల వెంకట్రావుపల్లిలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా సమీక్ష కేంద్రాలపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. విద్యార్థుల ప్రగతి, పాఠశాల మౌలిక వసతులు, లర్నింగ్ అవుట్‌కమ్స్‌పై సమీక్ష జరిపారు. అలాగే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పరీక్షలపై నిర్వహించిన అంశాలను పరిశీలించారు. యుడైస్, దీక్ష పోర్టల్ యాప్ వినియోగంపై కూడా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు కరుణాకర్, శ్యామదత్తు, గీత, రవీందర్, ఆంజనేయులు, శ్రీలత పాల్గొన్నారు. విద్యా సమీక్ష కేంద్రాల బలోపేతం ద్వారా విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించి, పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

## విజయవంతంగా ముగిసిన హెచ్‌పివి టీకా కార్యక్రమం



**గంగాధర, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఓద్యారం గ్రామంలోని జెడ్‌పి హెచ్‌ఎస్ పాఠశాలలో హెచ్‌పివి టీకా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. గర్భాశయ గ్రీవా క్యాన్సర్ నివారణకు ముఖ్యమైన ఈ టీకా 14--15 సంవత్సరాల బాలికలకు (26-02-2011 నుండి 25-02-2012 మధ్య జన్మించిన వారు) ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పిహెచ్‌సి గంగాధరలో అందజేశారు. డాక్టర్ శ్వేత, డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో టీకా ఇవ్వడానికి ముందు అవసరమైన పరీక్షలు నిర్వహించి, అనంతరం బాలికలకు టీకా అందించారు. తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థినులు సురక్షితంగా టీకా పొందారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో గర్భాశయ గ్రీవా క్యాన్సర్ మరియు ఇతర హెచ్‌పివి సంబంధిత వ్యాధుల నుండి రక్షణ కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హత గల బాలికలందరికీ హెచ్‌పివి టీకా వేయించేందుకు ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు సూచించారు. ఆయన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ప్రతి అర్హత గల విద్యార్థిని టీకా పొందేలా కృషి చేయాలని అధికారులను కోరారు.

## మంత్రి బండి సంజయ్ సమక్షంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**మానకొండూర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మానకొండూరు మండల కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర మంత్రివర్యులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇజిఎస్ నిధుల ద్వారా రూ.4 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో మానకొండూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఘనంగా ప్రారంభించారు. స్థానిక ప్రజలు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రివర్యులు ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, 2వ వార్డు మెంబర్ భాషబోయిన ప్రదీప్ యాదవ్, సోన్నకుల శ్రీనివాస్, నందగిరి బలరాం, కొండ్ర వరప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అట్టహాసంగా గాయత్రి డిగ్రీ అండ్ పీ.జీ కళాశాల ఫేర్ వెల్ డే

**పెద్దపల్లి, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గాయత్రి డిగ్రీ అండ్ పీ.జీ కళాశాల వీడ్కోలు మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనవకుండా, తమలోని నైపుణ్యాలను గుర్తించి రాణించాలని ఆయన సూచించారు. గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం విద్యతోనే కాకుండా జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగంలో కూడా అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని దిశా నిర్దేశంతో ముందుకు



సాగితే విజయం తప్పక వరిస్తుందని అన్నారు. డిగ్రీ పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరి విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు పేరు తెచ్చాలని ఆకాంక్షించారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లకు ఏసీపీ గజ్జి కృష్ణ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఉత్తేజపరిచాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. రవీందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల ఆసరాగా ప్రభుత్వ ఆసుపత్రి

- ఆధునిక శస్త్రచికిత్సలు విజయవంతం

**పెద్దపల్లి, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధునిక వైద్య సదుపాయాలతో పేదలకు ఆసరాగా నిలుస్తోంది. ఇటీవల నాలుగు కీలక శస్త్రచికిత్సలను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది. జమ్మికుంట మండలానికి చెందిన 50 ఏళ్ల మహిళ, చికురాయి గ్రామానికి చెందిన 42 ఏళ్ల మహిళలు గర్భాశయ సమస్యలతో ఆసుపత్రికి చేరగా, నిపుణులైన వైద్యులు ఆధునిక పద్ధతిలో హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు చేసి గడ్డలను తొలగించారు. ఓదెల గ్రామానికి చెందిన 32 ఏళ్ల మహిళ, నిమ్మనపల్లి గ్రామానికి చెందిన 55 ఏళ్ల మహిళలు గాల్ బ్లాడర్ నెక్‌లో స్టోన్ సమస్యతో బాధపడుతుండగా, లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సల్లో



లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహా రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, డాక్టర్ మీరాజ్, డాక్టర్ రవళిక, అనేస్తేషియా నిపుణులు డాక్టర్ స్వాతి, డాక్టర్ భవాని పాల్గొన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలలో పాల్గొని వైద్య బృందాన్ని, ఓటి సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డి ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ వంటి ఆధునిక సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆసుపత్రిలో అన్ని సేవలు ఉచితమని, ఎవరికీ లంచం ఇవ్వవద్దని, సమస్యలు ఎదురైతే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని, లేకపోతే కంప్లైంట్ బాక్స్‌లో ఫిర్యాదు ఇవ్వవచ్చని ఆయన స్పష్టం చేశారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆధునిక వైద్య సదుపాయాలతో పేదలకు నమ్మకమైన ఆశ్రయంగా నిలుస్తోంది

# లైసెన్స్ లేని సెక్యూరిటీ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు

**కరీంనగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ & అలైడ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం కోతి రాంపూర్ ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగింది. ప్రధాన కార్యదర్శి ఉట్ల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ అధ్యక్షులు పున్నం రవి మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా పనిచేస్తున్న సెక్యూరిటీ ఏజెన్సీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షాపింగ్ మాల్స్, బ్యాంకులు, ఏటీఎంలు, వాహనాల షోరూములు, గోదాములు, హాస్పిటల్స్, డీమార్ట్, వాల్‌మార్ట్, చిల్లర వ్యాపార దుకాణాలు, అపార్ట్మెంట్లలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు, వాచ్‌మెన్లకు యజమానులు 7,000--10,000 రూపాయల తక్కువ వేతనాలు ఇస్తూ





శ్రమను దోచుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని కోరితే కార్మికులను అకారణంగా తొలగించి, కొత్త వారిని పనిలో పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఫంక్షన్ హాల్స్, గార్డెన్లలో పనిచేసే తాత్కాలిక సెక్యూరిటీ గార్డులకు రోజుకు రూ.800 చెల్లించాలని యూనియన్ నిర్ణయించింది. 8 గంటల పని విధానాన్ని అమలు చేసి, అదనపు పనికి రెట్టింపు వేతనం చెల్లించాలని కోరారు. సెక్యూరిటీ ఏజెన్సీల ద్వారా నియమించబడిన గార్డులకు అపాయింట్మెంట్ లెటర్లు, ఫోటో గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యూనిఫాం, భద్రతా సామాగ్రి ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఏజెన్సీలు మారినా గార్డులను కొనసాగించాలని యూనియన్ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో పెరుమాండ్ల పరుశురాం, తోటి సత్తయ్య, తండ్ర కొమురయ్య, సుంకరపల్లి ప్రవీణ్, కూర సురేష్, బోడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సమాజం కోసం సాధన చేద్దాం

-ప్రొఫెసర్ చింతలపూరి బీనా
సైకాలజిస్ట్ ఉస్మానియా యూనివర్సిటీ

**హైదరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్బీనగర్ బాలాపూర్ లోని చైతన్య జూనియర్ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ సహాయం సైకలాజికల్ కౌన్సిలింగ్ మరియు వెల్నెస్ సెంటర్ మరియు సేవ్ ఎర్త్ ఫౌండేషన్ గౌరవ గవర్నర్ రాజ్ భవన్ తెలంగాణ రాష్ట్రం సహకారంతో



నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయగా సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మన్ సేవరత్న అవార్డు గ్రహీత డాక్టర్ టి సురేందర్, కళాశాల ఛైర్మన్ ఎస్ ప్రతాప్ రెడ్డి తో కలిసి మొక్కను అందజేసి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని వ్యసనాలను రూపుమాపుతూ మెరుగైన సమాజం కోసం సాధన చేద్దాం అన్నారు.

## వారసంతలకు వేలం పాటలు



**పాలకుర్తి, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండల కేంద్రంలో మరియు బసంతనగర్ తెలుగు మీడియం వద్ద నిర్వహించే రెండు వారసంతలకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయాలలో వేలం పాటలు జరిగాయి. 2026--27 సంవత్సరానికి థై బజార్ నిర్వహణ హక్కులు పొందేందుకు గ్రామస్థులు పోటీ పడ్డారు. బసంతనగర్ వారసంతను కన్నం కుమార్ రూ. 1,11,100కు, పాలకుర్తి వారసంతను ఐద సంజీవ్ రూ. 21,500కు వేలం పాడి దక్కించుకున్నారు. ఈ హక్కులు వచ్చే ఏడాది మార్చి నెల వరకు మాత్రమే అమలులో ఉంటాయని పంచాయతీ పాలకవర్గాలు వెల్లడించాయి. వేరువేరుగా నిర్వహించిన ఈ వేలం పాటల కార్యక్రమంలో రెండు గ్రామాల సర్పంచులు పర్శవేణి శ్రీనివాస్, పెద్దపల్లి తిరుమల ఆజిమల్లు, ఉప సర్పంచులు తమ్మనవేని మౌనిక, ఐద బుగ్గరామస్వామి, కార్యదర్శులు గంగలక్ష్మి, ప్రదీప్, వార్డు సభ్యులు కచ్చపాక సరిత, సల్లూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



**హుస్నాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఆరబోసిన మక్కలు అకాల వర్షం కారణంగా తీవ్రంగా తడిసిపోయాయి. మార్కెట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పూర్తిగా ఎండిన తర్వాత కూడా సంచులు ఇవ్వకపోవడంతో మక్కలు పూర్తిగా నానిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారతీయ కిసాన్ సంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్యులు, హుస్నాబాద్ శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి తడిసిన మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం రైతుల్లో ఆగ్రహం రేపుతోంది. రైతుల బాధలను గుర్తించి ఆర్డీవో, తాసిల్దార్ మార్కెట్ యార్డ్‌ను సందర్శించి తడిసిన మక్కలను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. లేకపోతే మార్కెట్ యార్డ్ ముందు ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు.

## సమయపాలన పాటించని ఏవోపై కలెక్టర్కు ఫిర్యాదు చేసిన రైతులు




**గన్నేరువరం, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గన్నేరువరం మండలంలోని పలు గ్రామాల రైతులు వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సుమారు 150 మంది రైతులు సంతకాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. రైతులు మాట్లాడుతూ ఏవో సమయపాలన పాటించకపోవడం వల్ల తాము పంటలపై సూచనలు పొందలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్ల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. వారానికి ఒకసారి కూడా ఏవో కార్యాలయానికి రాకపోవడం వల్ల తమ సమస్యలు విన్నవించుకునే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. రైతులు తమకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని, సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## అకాల వర్షంతో మొక్కజొన్న పంట నేలమట్టం



**పాలకుర్తి, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా కురిసిన గాలి వర్షానికి పాలకుర్తి మండలం కన్నాల, జయ్యారం గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమైంది. విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు బండి ప్రమోద్, ఏఈఓ ఎం. యువజన, బి. శశిధర్ మంగళవారం గ్రామాలను సందర్శించి బండారి సత్తయ్య, సందే పద్మ, బి. రవీందర్‌కు చెందిన పంటలను పరిశీలించారు. సుమారు ఎనిమిది ఎకరాల వరకు పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. అధికారులు నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఆర్.టి.సి బస్ స్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు



**కరీంనగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ ఆర్.టి.సి బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల6 దొంగతనాలను అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. దొంగతనాలకు తావులేకుండా ఉండేలా బస్ స్టాండ్ పరిసర ప్రాంతాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థలాలను గుర్తించారు. సోమవారం టౌన్ ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యక్షంగా బస్ స్టాండ్ ప్రాంగణాన్ని సందర్శించి భద్రతా అంశాలను పర్యవేక్షించారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించి కెమెరాలు అమర్చాల్సిన పాయింట్లను గుర్తించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు కనిపెట్టేలా 24 గంటల నిఘా ఏర్పాటు చేయడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ఏసీపీ తెలిపారు. వాహనదారులు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని, పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. ప్రయాణికుల రక్షణ, వాహనాల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని, త్వరలోనే ఈ నిఘా వ్యవస్థను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు.

## మహిళల సంక్షేమం, గ్రామీణ నెట్వర్క్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



**మంచిర్యాల, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. నస్పూర్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, రాయితీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలతో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. అదే సమయంలో జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండి మొబైల్ నెట్వర్క్ సేవలను విస్తరించి ప్రజలకు నాణ్యమైన సిగ్నల్స్ అందించాలని సూచించారు. బ్రాడ్‌బ్యాండ్ సేవలు, మొబైల్ టవర్ల ఏర్పాటు, భారత్ నెట్ వినియోగం వంటి అంశాలపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ రెండు సమావేశాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతంగా నిర్వహించిన ఎఫ్ఎల్ఎస్ పరీక్ష



**కరీంనగర్, మార్చి 31(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన ఎనిమిది పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సర్వే -- 2026 విజయవంతంగా నిర్వహించబడింది. ఈ రోజు మొత్తం నలభై మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా సాగింది. సంబంధిత మండల విద్యాధికారులు ఎంపిక చేసిన పాఠశాలలను సందర్శించి పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. అకాడెమిక్ మానిటరింగ్ అధికారి కె. అశోక్ రెడ్డి వేదం, సి.ఎస్.ఐ. పాఠశాలలను సందర్శించి పరీక్షా నిర్వహణను పరిశీలించారు. ఏసీఎల్‌బీ మరియు జిల్లా విద్యాధికారి అశ్విని తనాజీ వాకడే, ఐఏఎస్ కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించి పరీక్షా నిర్వహణను సమీక్షించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లతో, విద్యార్థులతో పరస్పరం మాట్లాడారు. అదనపు కలెక్టర్‌తో పాటు తిమ్మాపూర్ మండల విద్యాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పంకజ్ పాల్గొన్నారు. పరీక్ష నిర్వహణపై అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరీక్షను డిజిటల్ ట్యాబ్‌ల ద్వారా నిర్వహించడం వలన ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా పారదర్శకంగా పూర్తయింది. పరీక్ష అనంతరం అన్ని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ట్యాబ్‌లు మరియు పరీక్షా సామగ్రిని డైయెట్ వద్ద సమర్పించారు. ఎఫ్ఎల్ఎస్ -- 2026 విజయవంతంగా నిర్వహించబడినందుకు జిల్లా పరిపాలన సంతృప్తి వ్యక్తం చేసింది.

## రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్



**కరీంనగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సచివాలయం ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. వీరికి మద్దతుగా నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ పాల్గొని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ప్రజలకు ఎంతో సేవ చేసినప్పటికీ, వారు ఉద్యోగ సమయంలో దాచుకున్న డబ్బులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 25 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని, వీరిలో చాలామంది పిల్లల వివాహాలు, ఇల్లు నిర్మాణం వంటి అవసరాల కోసం ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రెండున్నర సంవత్సరాలుగా బెనిఫిట్స్ రాకపోవడంతో సుమారు 50 మంది మానసిక క్షోభకు గురై మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. కాంట్రాక్టులలో కమిషన్ల కోసం ప్రభుత్వం 63 వేల కోట్ల రూపాయలు విడుదల చేసిందని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను కక్ష సాధింపు ధోరణితో నిలిపివేయడం అన్యాయమని, వీరి హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని తెలిపారు. అసెంబ్లీలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బాధ్యులు, బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోతుల సమస్య పరిష్కరించిన మాజీ వైస్ ఎంపీపీకి ఘన సన్మానం



**పాలకుర్తి, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎన్నో ఏళ్లుగా కోతుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తుల సమస్యకు శాశ్వత పరిష్కారం చేసిన పాలకుర్తి మండలం మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామికి గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈశాల తక్కల్లపల్లి గ్రామంలోని శ్రీ కోదండరామాయణం, హనుమాన్ ఆలయాలలోకి కోతులు చొరబడి పూజా సామాగ్రిని ఎత్తుకెళ్లడం, భక్తులపై దాడి చేసి గాయపరచడం వల్ల భక్తులు గుడికి వెళ్లి పూజలు చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ సమస్యను గమనించిన ఎర్రం స్వామి తన స్వంత ఖర్చుతో రెండు ఆలయాలకు ఇనుప కంచెలు నిర్మించారు. దీంతో కోతుల బెడద తగ్గి భక్తులు ప్రశాంతంగా పూజలు చేసుకునే అవకాశం లభించింది. కృతజ్ఞతగా గ్రామస్థులు ఎర్రం స్వామిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కోల శివయ్య, తుంగ నర్సయ్య, ఎర్రం మల్లేశం, తాడవేని అంజయ్య, బైరి రాజేశం, పన్నాల లక్ష్మణ్, బొమ్మెన నారాయణ, సంకెళ్ళ సత్యనారాయణ, దీకొండ నర్సయ్య, బొల్లి మల్లేష్, భజన మండలి సభ్యులు, హనుమాన్ మాలధారణ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా ఉన్న డి-8 కాలువ పనులు




**గన్నేరువరం, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గన్నేరువరం మండలం మైలారం గ్రామంలోని డి--8 ఉపకాలువ పనులు అసంపూర్తిగా ఉండడంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వే నంబర్లు 312, 313 వద్ద పనులు నిలిచిపోవడంతో 300 మందికిపైగా రైతులకు చివరి ఆయకట్ట వరకు నీరు చేరకపోవడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో రైతులు సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడంలేదని, వెంటనే చర్యలు తీసుకుని సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

# అంగన్వాడీ కేంద్రానికి మరుగుదొడ్లు మంజూరు



**కరీంనగర్ ,మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుజురాబాద్ పురపాలక సంఘం 13వ వార్డు పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో చిన్నారులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అంగన్వాడీ టీచర్లు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన 13వ వార్డు కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు, 12వ వార్డు కౌన్సిలర్ రవీందర్ రావు కలిసి మున్సిపల్ చైర్మన్ సుహాసిని, కమిషనర్‌కు వివరించడంతో అంగన్వాడీ కేంద్రానికి టాయిలెట్స్ మంజూరు అయ్యాయి. మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణానికి ఈరోజు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ రవీందర్ రావు, మున్సిపల్ ఏఈ సుధాకర్ రెడ్డి, వార్డు ఆఫీసర్ నాగరాజు, అంగన్వాడీ టీచర్లు, కాంట్రాక్టర్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నంను కలిసి నూతన బస్ సర్వీసులు మంజూరు చేయాలని వొడితల ప్రణవ్ వినతి



**కరీంనగర్ , మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుజురాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు నూతన బస్ సర్వీసులు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నంను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఈ వినతిని సమర్పించారు. హుజురాబాద్ డిపో పరిధిలో మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని కూడా కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే కొత్త సర్వీసులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బేతిగల్--కరీంనగర్, మర్రిపల్లిగూడెం--హైదరాబాద్, జమ్మికుంట--హైదరాబాద్ డైరెక్ట్ సర్వీసులు ప్రారంభమయ్యాయని, త్వరలో మరిన్ని ప్రాంతాలకు కూడా బస్సులు నడుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తోట రాజేంద్ర ప్రసాద్, గూడూరి స్వామి రెడ్డి, నేరెళ్ళ మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక ప్రయోజనం

**సిద్దిపేట, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనం చేకూరిందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. 2023 డిసెంబర్ 9న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు దాదాపు రూ.10 వేల కోట్లను ఆదా చేసుకున్నారని ఆమె వెల్లడించారు. సిద్దిపేట ఐడిఓసి సమావేశ మందిరంలో మహిళా ఉద్యోగులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, చేయూత, గృహజ్యోతి, రాయితీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా మహిళల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక డిపోల ద్వారా లక్షలాది మహిళలు ప్రయాణించి కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని వివరించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు భరోసా, తెల్ల రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. మహిళలు సంక్షేమ పథకాల సద్వినియోగం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పథకం లబ్ధిదారులు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పిల్లల విద్య, వైద్య అవసరాల కోసం ఖర్చులు తగ్గాయని తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమం చివరగా పలువురు మహిళలను కలెక్టర్ సత్కరించారు.

## శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

**అమరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

శ్రీశైలం కుడి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పోరాటం ఫలించింది. సాగునీరు, త్రాగునీటి అవసరాల దృష్ట్యా విద్యుత్ ఉత్పత్తి ఆపాలని ఆయన డిమాండ్ చేయగా, ఏపీ జెన్కో అధికారులు వెంటనే స్పందించి ఉత్పత్తిని నిలిపివేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎమ్మెల్యే హెచ్చరించడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ప్రధాన డిమాండ్ నెరవేరడంతో ధర్నా కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తామని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు భారీ లబ్ధి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట బస్ స్టాండ్ ఆవరణంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు విశేష ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు మహిళలు దాదాపు రూ. 10,000 కోట్ల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని ఆయన వివరించారు. ఈ పథకం వల్ల రోజువారీ ప్రయాణ ఖర్చులు తగ్గి, ఉద్యోగాలు, వ్యాపారాలు, విద్య కోసం మహిళల ప్రయాణం సులభమైందని, కుటుంబ ఆర్థిక భారం తగ్గిందని చెప్పారు. గ్రామీణ ప్రాంత మహిళలకు పట్టణాలకు వెళ్లే అవకాశాలు పెరిగి, వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, నాయకులు, ప్రయాణికులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులపై కెఎల్‌ఆర్కు వినతి

**మహేశ్వరం, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ ఆధ్వర్యంలో వివేకానంద కాలనీ వాసులు కెఎల్‌ఆర్ను కలిశారు. బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వారు కోరారు. నాదర్‌గుల్--అంబేద్కర్ నగర్ రోడ్డు పనులు మధ్యలో ఆగిపోయాయని వాసులు తెలియజేయగా, కె ఎల్ ఆర్ అధికారులు సంప్రదించి పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గవర్దన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆనంద్ రెడ్డి, నాదర్‌గుల్ డివిజన్ కోఆర్డినేటర్ అంకంగారి వెంకటేష్ గౌడ్, బంగారి అశోక్, మహేందర్ యాదవ్, కుమార్ యాదవ్, బంగారి మణికంఠతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రారంభించారు. వేసవి కాలంలో శరీరానికి శక్తినిచ్చే, చల్లదనాన్ని కలిగించే పోషకాహారంతో కూడిన అంబలిని ప్రజలకు అందించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశం. పేద ప్రజలు, కార్మికులు, ప్రయాణికులు తక్కువ ఖర్చుతో లేదా ఉచితంగా ఆరోగ్యకరమైన ఆహారం పొందేలా ఈ సేవా కార్యక్రమం ప్రారంభమైంది. స్థానిక మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్వహిస్తున్న ఈ అంబలి కేంద్రం ప్రజల నుంచి మంచి స్పందన పొందుతోంది.

## తెలుగు వెలుగు జాతీయ అవార్డు పునస్కారం అందుకున్న జోనగోని యాదగిరి



**హుస్నాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవపూర్ గ్రామానికి చెందిన జోనగోని యాదగిరి తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. గత 25 సంవత్సరాలుగా వివిధ రంగాల్లో ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్లు నిర్వాహకులు రాజకుమార్ తెలిపారు. కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో యూట్యూబ్ స్టార్ నటులు ఆర్.ఎస్. నంద, గుంటి రాధిక కలిసి యాదగిరిని ఘనంగా సన్మానించారు.

## ముత్యాల పోచమ్మకు బోనాలు..

**పాపన్న పేట, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పాపన్న పేట మండల పరిధిలోని కుర్తివాడ లో గ్రామ దేవత ముత్యాల పోచమ్మకు గ్రామ ప్రజలు బోనమెత్తారు. మంగళవారం గ్రామంలో మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసుకొని గ్రామ మురవీధుల గుండా డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో వైభవంగా ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

# ఉద్యమకారులను మోసగించిన రేవంత్ రెడ్డి సర్కార్

**మర్రిగూడలో బిఆర్ఎస్ నేతల ఆవేదన**



**మర్రిగూడ, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం 14 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత రాష్ట్రం సిద్ధించిందని, ఆ పోరాటంలో సబ్బండ వర్గాలు, యువకులు, మేధావులు, కవులు, కళాకారులు ఎంతో త్యాగం చేశారని బిఆర్ఎస్ పార్టీ మండల రైతు బంధు సమితి మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. వారికి 250 గజాల స్థలం, 5 లక్షల రూపాయల గృహనిర్మాణ సహాయం, 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ఉచిత బస్సు పాస్, ప్రభుత్వ ఉద్యోగం, పెన్షన్ ఇవ్వాలని హామీ ఇచ్చినా అమలు చేయలేదు" అని విమర్శించారు. ఉద్యమకారుల హక్కులను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, వార్డు మెంబర్ కొండాపురం నరేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చెరుకు శ్రీరామ్ గౌడ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య గౌడ్, కొలుకులపల్లి యాదయ్య, మారగోని రామన్న, బురుగు నాగరాజు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి

**-దేవరకొండలో బీసీ సంక్షేమ సంఘం నిరసన**



**దేవరకొండ, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహం ముందు సోమవారం బీసీ సంఘ నాయకులు నిరసన ఆందోళన చేపట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా మహాత్మ జ్యోతిబాపూలే పేరుతో బీసీ సబ్ ప్లాన్ చట్టం చేస్తామని, ప్రతి ఆర్థిక సంవత్సరంలో 20 వేల కోట్ల రూపాయలు కేటాయించి ఐదు సంవత్సరాలకు లక్ష కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ అమలుకు నోచుకోలేదు" అని విమర్శించారు. బడ్జెట్‌లో జనాభా ప్రాతిపదికన కాకుండా కేవలం 3.8% కేటాయింపులు చేసి, అందులో అర శాతానికి తక్కువ ఖర్చు చేస్తున్నారని గణాంకాలు సూచిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పున్న వెంకటేష్ నేత, పున్న బిక్షమయ్య, జక్కుల అంజి యాదవ్, బొమ్ము శ్రీనివాస్ యాదవ్, పొలమోని శేఖర్ గౌడ్, నట్వా సుధాకర్, చెరుకు అంజి గౌడ్, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన హనుమాన్ జయంతి ఉత్సవాలు



**మనోహరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు మూడు రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించబడుతున్నాయని గ్రామ పురోహితుడు రాము శర్మ తెలిపారు. ఉత్సవాల తొలి రోజు మంగళవారం రామాలయంలో హనుమాన్ దీక్ష స్వాములకు ఇరుముడి కార్యక్రమం జరిగింది. అనంతరం ఇరుముడి కార్యక్రమానికి విచ్చేసిన భక్తులందరికీ బంతి భోజనాలు ఏర్పాటు చేశారు.

# మద్యం మత్తులో దారుణం





**భార్య, కుమారుడిని హత్య చేసిన భర్త**
**-- రంగారెడ్డి జిల్లాలో విషాదం**


నిందితుడు

**ఆమనగల్, మార్చి 31(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని పులిగోని తాండలో మద్యం మత్తులో భర్త కుటుంబంపై దాడి చేసి భార్య, కుమారుడిని హత్య చేసిన దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తాండాకు చెందిన రాందాస్ నాయక్ ఆమనగల్ కాటన్ మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య కవితతో కలిసి నలుగురు సంతానంతో జీవనం సాగిస్తున్నాడు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే రాందాస్ నాయక్ మద్యానికి బానిసై పెళ్లి అయినప్పటి నుంచి తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. ఈ కుటుంబ కలహాలు చివరకు విషాదానికి దారితీశాయి. మద్యం మత్తులో అదుపు కోల్పోయిన రాందాస్ నాయక్, భార్య కవితతో పాటు తన కుమారుడు హర్షిత్ (6) గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో భార్య, కుమారుడు అక్కడికక్కడే మృతి చెందారు. కూతురు ప్రణీత (8) తీవ్రంగా గాయపడగా, ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరు కుమార్తెలు సంఘటన సమయంలో అమ్మమ్మ ఇంట్లో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఏసీపీ జానకిరామ్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. మద్యానికి బానిసై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామని, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడవుతాయని ఆయన తెలిపారు. ఈ ఘటనతో పులిగోని తాండలో విషాద వాతావరణం నెలకొంది. ఒకే కుటుంబంలో జరిగిన ఈ దారుణ హత్యాకాండ స్థానికులను కలచివేసింది.

# విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శి ఉపాధ్యాయులు

**-దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ సన్మానం**




**దేవరకొండ, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 38 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలందించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీమతి రెబెకా సదానందం మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "అట్టడుగు వర్గాల నుండి విద్యను ఆయుధంగా తీసుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రెబెకా సదానందం మూడు దశాబ్దాలకు పైగా అపారమైన నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన మహనీయురాలు. గ్రామీణ ప్రాంత బాలికలకు విద్యా ప్రాధాన్యతను చాటి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ఇలాంటి ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శం, వారి సేవలు తరతరాలకు స్ఫూర్తి" అని కొనియాడారు. ప్రభుత్వం కూడా విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, ఉపాధ్యాయుల పాత్రను మరింత బలోపేతం చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం రెబెకా సదానందం దంపతులకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి, విశ్రాంత జీవితం ఆరోగ్యకరంగా, సుఖశాంతియుతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, మాజీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి మురళి, ఎంఈఓ మాతృ నాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా వెయ్యి కోట్ల రూపాయలు ఆదా

**-మహాలక్ష్మి పథకం విజయవంతం**
**- ఎమ్మెల్యే బాలునాయక్**



**దేవరకొండ, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన ప్రగతి పథం అనే నినాదంతో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి ఇప్పటివరకు వెయ్యి కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. దేవరకొండ ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్టాండ్ ప్రాంగణంలో సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వారం రోజుల్లోనే మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చింది. ఈ పథకం వల్ల మహిళలు ఆర్థిక భారం లేకుండా స్వేచ్ఛగా ప్రయాణిస్తూ తమ దైనందిన అవసరాలను సులభంగా నిర్వహించుకుంటున్నారు. ఇది మహిళల సాధికారత దిశగా ఒక కీలకమైన అడుగు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే కాకుండా ఆర్థిక స్థితి కూడా బలోపేతం అవుతోంది" అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. ఇకపై కూడా ప్రజల సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రతి మహిళ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించి ఆర్థికంగా ప్రయోజనం పొందిన మహిళలను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమునా మాధవరెడ్డి, ఆర్.ఎం (ఎం) నల్లగొండ భీంరెడ్డి, డీఎం విజయకుమారి, వార్డు కౌన్సిలర్ గాజుల సావిత్రి, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# వీర హనుమాన్ విజయ యాత్రకు ముందస్తు బైక్ ర్యాలీ

మిర్యాలగూడలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కార్యక్రమం






**మిర్యాలగూడ, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వీర హనుమాన్ విజయ యాత్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం జరగనున్న మహా యాత్రకు ముందస్తుగా మంగళవారం మిర్యాలగూడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ శాంతినగర్, ఎన్ఎస్పి క్యాంప్ మెయిన్ రోడ్, షాబు నగర్, రామ్‌నగర్, బంగారుగడ్డ, బాపూజీ నగర్, ప్రకాశ్ నగర్ వీధుల గుండా సాగింది. భారతమాతకు జై, జై శ్రీరామ్, రామలక్ష్మణ జానకి జై, బోలో హనుమాన్ కి అంటూ నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నల్గొండ విభాగ కార్యదర్శి గంజి సుధాకర్ మాట్లాడుతూ, "ప్రతి ఇంటి నుంచి ఒక్కో హిందూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గార్లపాటి ఉమాకర్ రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్, నగర అధ్యక్షులు, మొరబోయిన నవీన్, బజరంగ్ దళ్ సంయోజక మహేందర్, ఆవుల నరేష్, కిరణ్ రాజు, నాగరాజు, దేవాలయ అధ్యక్షులు గొల్ల గోపూ, సాయిలు, శశికుమార్, డాక్టర్ ప్రకృతి, అంజయ్య, తల్లం వెంకన్న, కనపర్తి రాంప్రసాద్, నర్సింగ్ పటేల్, సతీష్, బానోతు లింగనాయక్, అజ్మీర వేణు, నక్క నాగార్జున, కూరాకుల పాల్, కవిత, సునీత, నీలం వెంకటేశ్వర్లు, బండి వెంకటరమణ, మేక వెంకటేష్, రమేష్, రవి, యూసుఫ్ గారు, రవిచంద్రబోస్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**షాద్‌నగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ శ్రీ గోదా సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల భాగంగా మంగళవారం శివపార్వతుల కళ్యాణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, ఆలయ అర్చకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, కె.కె. కృష్ణ, పెంటయ్య, దామోదర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు రాం భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం

-మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ వ్యాఖ్యలు



**షాద్‌నగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎంతోకాలంగా షాద్‌నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు. మంగళవారం హెచ్ఎండిఏ ఏఈ విశ్వతేజ చౌరస్తా ప్రాంగణాన్ని పరిశీలించారు. విస్తరణలో భాగంగా సదర్ ప్రాంతాన్ని తిలకించి, అవసరమైన సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, "చౌరస్తా విస్తరణ పనులు పట్టణ ప్రజల సౌకర్యార్థం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తాయి. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పట్టణ అభివృద్ధికి ప్రజలు, వ్యాపారస్తులు పూర్తి సహకారం అందిస్తున్నారు" అని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, సాదిక్, వీర్లపల్లి మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# పారక్వాట్ గడ్డి మందు నిషేధం హర్షణీయం

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**హైదరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పారక్వాట్ గడ్డి మందును నిషేధిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. అత్యంత విషపూరితమైన ఈ మందు వల్ల వందలాది మంది తెలంగాణ రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రైతు సంఘాల నేతలు గడ్డి మందు నిషేధించాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో నిషేధించడమే కాకుండా దేశవ్యాప్తంగా కూడా నిషేధించేందుకు కేంద్రానికి లేఖ రాయాలని కమిషన్ సూచించింది. అసెంబ్లీలో తీర్మానం పెట్టడం సంతోషకరమని కోదండరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కమిషన్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో జరిగిన సమావేశంలో అమెజాన్‌లో కూడా ఈ విషపూరిత గడ్డి మందు అందుబాటులో ఉండడంపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. అమెజాన్‌కు లైసెన్స్ ఎలా ఇచ్చారో, విషపూరిత మందును ఎట్లా సరఫరా చేస్తున్నారో ప్రశ్నించింది. దీనిపై నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. అదేవిధంగా భూసార పరీక్షా కిట్ల పనితీరుపై సమీక్షించి, రైతుల్లో భూసార పరీక్షపై మరింత అవగాహన కల్పించాలని, నేలకు తగ్గట్టుగా పంటలు సాగు చేయాలని సూచించింది. పంటల మార్పిడి విధానంపై కూడా రైతుల్లో అవగాహన పెంచాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, కె.వి.ఎన్. రెడ్డి, మెంబర్ సెక్రటరీ గోపాల్, వ్యవసాయ శాఖ అధికారులు గీతారెడ్డి, సుచరిత, శ్రీధర్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# చామనపల్లి హత్య కేసులో 15 మందికి యావజ్జీవ శిక్ష



**కరీంనగర్ రూరల్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: చామనపల్లి గ్రామంలో 2019 ఏప్రిల్ 19న జరిగిన బోజ్జ తిరుపతి హత్య కేసులో జిల్లా ప్రధాన మరియు సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితులుగా ఉన్న 15 మందికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు తలో రూ. 1,500 జరిమానా విధించింది. గ్రామ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఉన్న తిరుపతిని సభ్యత్వం నుండి తొలగించారనే కక్షతో మయాకల ధర్మరాజం మరియు ఇతరులు పథకం ప్రకారం రాళ్లతో దాడి చేసి, గొంతు నులిమి హత్య చేశారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసు అధికారులు, ప్రాసిక్యూషన్ బృందాన్ని సీపీ అభినందించారు. నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# గ్రామ దేవతలను పూజించడం సంప్రదాయం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గ్రామ దేవతలను పూజించడం మన తెలంగాణ ప్రాంత సంప్రదాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఎన్ఎస్ఈయుఐ మండల ఇంచార్జ్ ప్రవీణ్ గౌడ్ నివాసంలో మంగళవారం శ్రీ ఎల్లమ్మ దేవత కళ్యాణ ఉత్సవం భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యాట నర్సింహా, యూత్ కాంగ్రెస్ నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి దేవత ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక, సాంప్రదాయ కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. దేవత కృపతో ప్రతి కుటుంబం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు షాబుద్దీన్, వార్డ్ సభ్యులు ఈర్లపల్లి మల్లేష్, మండల సోషల్ మీడియా కన్వీనర్ విజయ్ గౌడ్, శివ కుమార్, శ్రీశైలం, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వ శుభవార్త

మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి పంపిణీ



**హైదరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఏప్రిల్ 1, 2026 నుండి మూడు నెలల సన్నబియ్యం కోటా (ఏప్రిల్, మే, జూన్)ను ఒకేసారి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనుంది. ప్రజలు ఎండల్లో గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండాల్సిన ఇబ్బందులు లేకుండా, ఒకేసారి మూడు నెలల బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రేషన్ డీలర్లు ప్రజలకు ఇబ్బంది కలగకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలు కూడా రేషన్ డీలర్లు సౌకర్యవంతంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

# హెచ్‌సిఏ కార్యదర్శిగా ఎన్నికైన జీవన్‌రెడ్డికి సన్మానం



**షాద్‌నగర్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన మన్నే జీవన్‌రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గౌరవప్రదంగా సన్మానించారు. హెచ్‌సిఏ కార్యదర్శిగా ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే శంకర్, జీవన్‌రెడ్డి భవిష్యత్తు కృషి ద్వారా తెలంగాణ క్రికెట్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మార్చి మాసం- మంటల మేఘాలు, మార్పుల మార్గాలు

ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో కీలక మలుపులకు వేదికగా నిలిచిన మార్చి మాసం, మానవాళికి ఒక హెచ్చరికగా నిలిచింది. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో ఇరాన్ – – ఇజ్రాయెల్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి సవాల్‌గా మారాయి. ప్రత్యక్ష యుద్ధం రూపుదాల్చకపోయినా, పరోక్ష దాడులు, ప్రతిదాడులు కొనసాగుతుండటం అంతర్జాతీయ సమీకరణాలను సంక్లిష్టం చేస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో యునైటెడ్ స్టేట్స్ తన వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా ఇజ్రాయిల్‌కు అండగా నిలుస్తూ, ప్రపంచ రాజకీయ సమతుల్యతపై తన ముద్రను మరింతగా మోపుతోంది. ఫలితంగా, యుద్ధం మంటలు ఎప్పుడైనా మరింత విస్తరించే అవకాశాలపై ప్రపంచ దేశాలు అప్రమత్తంగా గమనిస్తున్నాయి.

**ప్రపంచ ఆర్థిక రంగంపై ప్రభావం**

మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది. భద్రతా పెట్టుబడుల వైపు మొగ్గు చూపిన పెట్టుబడిదారుల కారణంగా బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిడిని పెంచింది.

**భారత ముందు చూపు ధోరణి**

భారతదేశం ఈ పరిణామాలను సమతుల్య దృష్టితో పరిశీలిస్తూ తటస్థ విదేశాంగ విధానాన్ని



కొనసాగిస్తోంది. మధ్యప్రాచ్య ప్రాంతంతో ఉన్న ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను దృష్టిలో ఉంచుకుని అప్రమత్త వైఖరిని అవలంబిస్తోంది.

ఇక బంగారం ధరల పెరుగుదల, ఇంధన వ్యయాల ప్రభావం దేశీయ ఆర్థిక వ్యవస్థపై ప్రతిఫలిస్తోంది.

**తెలంగాణలో ప్రతిస్పందన**

ప్రపంచ పరిణామాల ప్రభావం తెలంగాణ రాష్ట్రంలోనూ ప్రతిబింబించింది.

బంగారం ధరల పెరుగుదల సామాన్య ప్రజల కొనుగోలు సామర్థ్యాన్ని ప్రభావితం చేయగా, ఇంధన వ్యయాల పెరుగుదల జీవన వ్యయాన్ని పెంచింది.

అదే సమయంలో ఆశా వర్కర్ల వంటి వర్గాల ఆందోళనలు, ప్రజా సమస్యలపై నిరసనలు సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించాయి.

**రాజకీయ,సామాజిక పరిణామాల**

మార్చి నెలలో దేశీయ, రాష్ట్ర స్థాయిల్లో రాజకీయ చర్చలు ఉధృతమయ్యాయి. స్థానిక స్థాయిలో నాయకత్వ మార్పులు, ప్రజా సమస్యలపై నిరసనలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని తెలియజేశాయి. మహిళా సంఘాలు, సామాజిక సంస్థల చైతన్య కార్యక్రమాలు సమాజంలో అవగాహనను పెంచాయి. మొత్తానికి మార్చి మాసం ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని అందించింది. యుద్ధం మంటలు కేవలం సరిహద్దులకే పరిమితం కావని, అవి ఆర్థిక, సామాజిక రంగాలను సైతం ప్రభావితం చేస్తాయని మరోసారి నిరూపితమైంది.

"శాంతి స్థిరత్వానికి పునాది, యుద్ధం అస్థిరత్వానికి ప్రతీక. మార్చి మాసం ఈ నిజాన్ని మరొక్కసారి మానవాళికి గుర్తుచేసింది."

గంగవరం రామకృష్ణారెడ్డి
( సీనియర్ జర్నలిస్ట్ వనపర్తి )



# రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వ శుభవార్త

-మూడు నెలల సన్నబియ్యం ఒకేసారి పంపిణీ



**హైదరాబాద్, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఏప్రిల్ 1, 2026 నుండి మూడు నెలల సన్నబియ్యం కోటా (ఏప్రిల్, మే, జూన్)ను ఒకేసారి రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనుంది.ప్రజలు ఎండల్లో గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండాల్సిన ఇబ్బందులు లేకుండా, ఒకేసారి మూడు నెలల బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.రేషన్ డీలర్లు ప్రజలకు ఇబ్బంది కలగకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రజలు కూడా రేషన్ డీలర్లు సౌకర్యవంతంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి

-ఎలిగేడు సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎలిగేడులో 15 లక్షలతో సిసి రోడ్డు ప్రారంభిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఉపసర్పంచ్ ముంజం నరేష్

**ఎలిగేడు, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ ప్రజలకు కావలసిన మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని సర్పంచ్ కప్పల ప్రవీణ్ తెలిపారు.ఎలిగేడు మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సహకారంతో ఎస్‌డిఎఫ్ నిధులు రూ.15 లక్షలతో రెండవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ, "గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు అందించిన ఎమ్మెల్యే విజయరమణారావుకు గ్రామస్థుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు" తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్ రావు, వార్డు సభ్యులు పల్లె కార్తీక్, న్యాతరి పోచాలు, మడుపు నరేందర్, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, ముంజంపల్లి రాకేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బూర్ల వెంకటసత్యం, సింగిరెడ్డి చంద్రారెడ్డి, కోట శ్రీరాంత్, అమ్ముల శ్రీకాంత్, అనిల్, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టుకు పాదయాత్రగా హనుమాన్ స్వాములు

-లలితపల్లి నుండి బయలుదేరిన భక్తులు



కొండగట్టు కు పాదయాత్ర గా వెళుతున్న లలిత పల్లె హనుమాన్ భక్తులు.

**ఎలిగేడు, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని లలితపల్లి గ్రామంలో హనుమాన్ మాల ధరించిన స్వాములు 21 రోజుల పాటు నిష్టతో మాలలో ఉండి సోమవారం కొండగట్టు హనుమాన్ ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు.లాలపల్లె హనుమాన్ ఆలయం, దూళికట్ట హనుమాన్ ఆలయాల నుండి ప్రారంభమైన ఈ పాదయాత్రలో హనుమాన్ స్వాములు అమరగొండ అరవింద్, మండల అనిల్, ఎలుక అనిల్, సందవేణి శ్రీను పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ స్పెషల్ ఇన్విటీస్‌గా ఆచారి



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ స్పెషల్ ఇన్విటీస్‌గా జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి సోమవారం ఎంపికయ్యారు. ఈ మేరకు కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, యువత ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవా దృక్పథంతో పార్టీ అభివృద్ధికి కృషి చేసి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయన నియామకం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని తెలిపారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు విటాయిపల్లికి చెందిన వెంకటయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము మంగళవారం వెంకటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. తనవంతు సహాయంగా 3 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంచుకొండ జగదీష్, గ్రామ అధ్యక్షుడు శంకర్ నాయక్, చంద్రు నాయక్, మాజీ సర్పంచ్ సాలయ్య, పాపయ్య, కిషోర్ నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, నరేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ తైబజార్ వేలంపాట వాయిదా



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో జరగాల్సిన తైబజార్ వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నిర్వహించాల్సిన వేలాన్ని బుధవారం మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సూచించారు. వేలం పాటకు సంబంధించిన అన్ని నిబంధనలు యథాతథంగా కొనసాగుతాయని కమిషనర్ శంకర్ నాయక్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, కౌన్సిలర్స్ ఎనుమల రమేష్, నాగిళ్ళ జగన్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, మొక్తల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం తదితరులు ఉన్నారు.

# విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

-విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేష్



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో కడ్తాల్ మండలం చరికొండ సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్, టీవీ9 ఛైర్మన్ జూలూరు సత్యం గౌడ్, డిఆర్డిఎల్ వెండర్ సురేష్ బాబు లు మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా చరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమస్యలను గురించి ఆయనకు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన చారగొండ వెంకటేష్ త్వరలోనే గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేసిందని, ఇందులో భాగంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

# బార్ కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం



**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు కోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎర్రవోలు శేఖర్, సహాయ కార్యదర్శిగా బద్రిపల్లి మధు, కోశాధికారిగా ఎగిరిశెట్టి మల్లేష్ లు ఎన్నికైన సందర్భంగా మంగళవారం 4వ వార్డు కౌన్సిలర్ న్యాయవాది దుడ్డు ఆంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ లో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఏర్పుల రామకృష్ణ, వస్పుల మల్లేష్, కొప్పు కృష్ణ, జగన్ గౌడ్, ప్రభు నాయక్, తలారి మహేష్, శిరీష, మొగిలిశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు క్రమశిక్షణే తొలి మెట్టు







**విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి**

**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు క్రమ శిక్షణే తొలి మెట్టుగా నిలుస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ గ్రాడ్యుయేషన్ డే మరియు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, వైస్ ఛైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి, సినీ యాక్టర్ నోయెల్, సైకాలజిస్ట్ కొండల్ పులి, రైటర్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లోజు ఆచారి మాట్లాడుతూ.. పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకుంటారన్నారు. డబ్బుతో సాధ్యంకాని ఉన్నత పదవులను చదువుతో సొంతం చేసుకోవచ్చునని తెలిపారు. పరీక్షలంటే భయాన్ని వీడాలని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని తెలిపారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ ఛైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, అకాడమిక్ అడ్వైజర్ జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి, కరెస్పాండంట్ జిల్లెల్ల సుజాత రెడ్డి, డైరెక్టర్ చుక్క సావిత్రి, ప్రిన్సిపాల్ చెన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ హైమావతి, శ్రీజన్య, ఉపాధ్యాయులు శివలింగం, శర్మ, శ్రీశైలం, యాదయ్య, నవ్య, మమత, మౌనిక, దీప్తి, తేజ తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ వ్యర్థాల టెండర్ ను రద్దు చేయండి



**అమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** అమనగల్లు మున్సిపాలిటీలో మంగళవారం తైబజార్ బజార్ మరియు చికెన్ వ్యర్థాల వేలం నిర్వహించారు. ఈ మేరకు చికెన్ వ్యర్థాల టెండర్లు స్థానికులకు అవకాశం కల్పించాలని కోరుతూ పట్టణ యువకులు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. టెండర్లను కేవలం మున్సిపాలిటీకి చెందిన వారికి మాత్రమే అవకాశం కల్పించి ప్రస్తుతం ఉన్న టెండర్లను రద్దు చేసి నూతన టెండర్లను వేయాలని కోరారు. వినతి అందజేసిన వారిలో మున్సిపాలిటీ నాయకులు నాగిళ్ళ లక్ష్మణ్, ఒగ్గు మహేష్, కొమ్ము ప్రసాద్, జల్లెల శివ, పాతకోట శ్రీశైలం, ముక్కెరి వెంకటేష్, పుల్లారెడ్డి శ్రీశైలం, లండం మల్లేష్ తదితరులు ఉన్నారు.

# గురుకుల బాలికల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

**-విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ**



**వెల్దండ, మార్చి 31(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రజా ప్రణాళికలో 99వ కార్యక్రమం భాగంగా ప్రత్యేక ఆరోగ్య శిబిరం సోమవారం నిర్వహించారు.విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వారిలో ఆరోగ్య స్పృహ పెంపొందించడం ఈ శిబిరం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థినీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత (అనీమియా) సమస్యను గుర్తించారు. అదేవిధంగా ఆరోగ్య విద్య, వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యత, పౌష్టికాహారం అవసరం, సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.పరీక్షల అనంతరం అవసరమైన విద్యార్థులకు ఉచిత మందులు, తగిన వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు, డాక్టర్ రమణకుమార్, డాక్టర్ కవిత, గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం, పర్యవేక్షణ అధికారి మురళీకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీకళ, పుష్ప, ఫార్మసీ ఆఫీసర్ అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.పాఠశాల యాజమాన్యం, వైద్య బృందం మాట్లాడుతూ, "ఇలాంటి శిబిరాలు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడి, వారి విద్యాభ్యాసం ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు తోడ్పడతాయి" అని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి సీఐ వెంకటేశ్వర్లుల ఆర్థిక సాయం

**అంత్యక్రియల ఖర్చులకు రూ.15 వేల సహాయం**




**ఆమనగల్లు, మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం సీతారాం నగర్ తండా పరిధిలోని పులుగొనిపల్లి తండాకు చెందిన బాణావత్ రాందాస్ నాయక్ చేతిలో భార్య, కుమారుడు మృతి చెందిన ఘటనపై సీఐ వెంకటేశ్వరులు స్పందించారు.మృతురాలి అక్క కళకు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి చట్టపరంగా పూర్తి న్యాయం చేస్తామని సీఐ వెంకటేశ్వరులు హామీ ఇచ్చారు.

# చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**-శరత్ చంద్రపవార్**



**దేవరకొండ మార్చి 31 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ సబ్-డివిజన్ పరిధిలోని చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి, సిబ్బంది పనితీరు, శాంతిభద్రతల పరిస్థితి మరియు ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు.తనిఖీ సందర్భంగా ఎస్పీ రిసెప్షన్ నిర్వహణ, మహిళా సహాయ కేంద్రం, స్టేషన్ రైటర్ విభాగం, లాకప్, ఎస్హెచ్ఓ కార్యాలయంతో సహా కీలక విభాగాలను పరిశీలించడంతో పాటు, కేసు రికార్డులు మరియు కొనసాగుతున్న దర్యాప్తులను కూడా తనిఖీ చేశారు. సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం లేకుండా సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.పోలీసు సిబ్బందిని అక్కడే ఉండమని ఎస్పీ ఆదేశించారు. క్రమం తప్పకుండా సందర్శించడం ద్వారా ప్రజలతో అనుసంధానం గ్రామాలు మరియు ఫిర్యాదులకు తక్షణమే స్పందించడం. ఎస్ఎఫ్ శాంతిభద్రతలను కాపాడాలని సార్ నొక్కిచెప్పారు, త్వరగా డయల్ 100 కాల్స్‌కు స్పందన, మరియు సమర్థవంతమైన గస్తీ. గంజాయి, అక్రమ ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, ముగ్గురు ప్రయాణించడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమం లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రాజు, ఎస్ఐ రామమూర్తి తదితర అధికారులు, పోలీసు సిబ్బంది ఈ తనిఖీలో పాల్గొన్నారు.

# మూడు నెలల రేషన్ సరఫరాకు సర్వం సిద్ధం

**ఐజ మండల తహసిల్దార్ జ్యోతి**



**మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం తాసిల్దార్ ఆఫీస్ దగ్గర డీలర్ల సమావేశం ఏర్పాటు చేసి త్రిబుల్ రైస్ అనగా ఏప్రిల్ మే జూన్ 2026 మాసాలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది . అయిజ మండలంలో ఏ ఎఫ్ ఎస్ సి కార్డ్స్ 1460. ఎఫ్ ఎస్ సి కార్డ్స్ 25697 కార్డ్స్ కు మూడు నెలలకు గాను బియ్యం సుమారుగా 18782-76 కేజి ల చౌక ధర దుకాణాలకు దిగుమతి చేయడం జరుగుతున్నది . అంతే కాకుండా రేపు ఒకటి నాలుగు 2026 నుండి 30-4 -2026 వరకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో బియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది .కావున కార్డు వినియోగదారులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తాసిల్దార్ మేడం ఒక ప్రకటనలో తెలియజేసినారు.

# అకాల వర్షం అపార నష్టం

**రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి**




ఈదురుగాలులకు ముప్పిరితోట లో నేలరాలిన మామిడి కాయలు



దూళికట్టలో నేల కొరిగిన మొక్కజొన్న



నర్సాపూర్ లో కరెంటు వైర్ల పై చెట్లు పడడం జరిగింది



**ఎలిగేడు,మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల పరిధిలో పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురు గాలులు విరుచుకుపడ్డాయి. దీంతో మొక్కజొన్న, వరి పంటలు, మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.ముప్పిరితోట గ్రామపంచాయతీ పరిధిలోని 22 ఎకరాల మామిడి తోటను వేలంపాటలో రూ.7 లక్షల 5 వేలకు ముత్యం లచ్చయ్య దక్కించుకున్నారు. అయితే ఈదురుగాలుల కారణంగా తోటలోని మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. దిగుబడి రావాలని రూ.68,000 విలువైన ఎరువులు వేసిన పెట్టుబడి వృథా అయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.పంటలు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు.

# జిల్లా బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలుగా తోట మంజుల రావు..

**మంచిర్యాల మార్చి 31 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచిర్యాల జిల్లా బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలుగా పట్టణానికి చెందిన తోట మంజులరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం నిర్వహించిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఆమె జిల్లా బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మాదాపూర్ కు చెందిన తోట మంజులరావు,మెట్టినిల్లు మందమర్రి పట్టణంలో తన వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తూ,జిల్లాలో న్యాయవాదిగా అడుగుపెట్టి,బార్ కౌన్సిల్ మహిళ రిప్రజెంటివ్ గా గతంలో రెండు సంవత్సరాలు పనిచేసి, అంచెలంచెలుగా ఎదుగుతూ,నేడు బార్ కౌన్సిల్ జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయింది. సుంకర (తోట) మంజుల రావు నియామకం పట్ల ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆమెను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరిన్ని పదవులు స్వీకరించి,మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



# మాస్ లుక్ లో ఫరియా అబ్దుల్లా

టాలీవుడ్ చిట్టి అలియాస్ ఫరియా అద్బుల్లా.. హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తుంది. మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్న ఈ సుందరి. ఆతర్వాత పెద్దగా సక్సెస్ సాదించలేకపోతుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న పెద్దగా లాభం లేకుండా పోతుంది. జాతిరత్నాలు సినిమాతో పరిచయమైన ఫరియా.. ఆ సినిమాలో తన క్యూట్ పర్ఫామెన్స్ తో కట్టిపడేసింది. అలాగే తర్వాత వచ్చిన సినిమాల్లో గ్లామరస్ గా కనిపించి కవ్వించింది. తన అందాలతో మతిపోగొట్టింది ఫరియా అద్బుల్లా.. కానీ సినిమాలు పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. సింహా హీరోగా నటించిన మత్తువదలరా 2 సినిమా ఒక్కటి కాస్త పర్లేదు అనిపించుకుంది. కానీ ఆతర్వాత మళ్లీ ఫ్లాప్స్ పలకరించాయి. చివరిగా ఈ అమ్మడు గుర్రం పాపిరెడ్డి అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రూటు మార్చి మాస్ పాత్రతో ఆకట్టుకోనుంది. ప్రస్తుతం ఫరియా అద్బుల్లా భగవంతుడు అనే సినిమాలో నటిస్తుంది. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ ను విడుదల చేశారు. ఈ టీజర్ లో ఫరియా అద్బుల్లా మాస్ పాత్రలో కనిపించింది. అలాగే బోల్డ్ గానూ నటించింది. ఈ సినిమాతో ఫరియా అద్బుల్లా హిట్ కొట్టేలా కనిపిస్తుంది.కాగా సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు ఓ రేంజ్ లో అందాలతో రచ్చ చేస్తుంది. కుర్రాళ్లు చూపుతిప్పుకోనివ్వకండా ఫోటోలు షేర్ చేస్తుంది. ఈ సుందరి షేర్ చేసే ఫోటోలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. నెటిజన్స్ రెచ్చిపోయి కామెంట్స్ చేస్తున్నారు.




# పర్వీన్ బాబీ బయోపిక్‌లో?

బాలీవుడ్ లెజెండరీ హీరోయిన్ పర్వీన్ బాబీ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానున్నది. జోయా మెహ్రా తెరకెక్కించనున్న ఈ చిత్రంలో పర్వీన్ బాబీగా త్రిప్తి డిమ్రీ కనిపించనున్నది. పర్వీన్‌బాబీ జీవితంలోని గ్లామర్, వివాదాలు, వ్యక్తిగత పోరాటాలు.. వీటన్నింటినీ సమతుల్యంచేసి, అద్భుతమైన బయోపిక్‌గా ఈ చిత్రాన్ని తెరమీదకు తీసుకురావాలనే ప్రయత్నంలో మేకర్స్ ఉన్నారు.అయితే.. పర్వీన్‌గా త్రిప్తీని ఎంపిక చేయడంపై బాలీవుడ్‌లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గొప్పనటిగా కీర్తింపబడ్డ పర్వీన్‌బాబీ పాత్రకు త్రిప్తి న్యాయం చేయగలదా? అంటూ కొందరు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ డిబేట్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేటయింది. త్రిప్తి డిమ్రీపై మేకర్స్ మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. త్వరలోనే సినిమా సెట్స్‌కి వెళ్లనుంది.

# ‘కథనార్’ ట్రైలర్ రిలీజ్..

## అనుష్క మరోసారి పీరియాడిక్ అవతారంలో మెప్పించనుందా?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ‘బాహుబలి’ తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల ‘ఘాటీ’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ ‘కథనార్’తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.తాజాగా విడుదలైన ‘కథనార్’ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. ఇక అనుష్క ఫ్యాన్స్ మాత్రం ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ‘బాహుబలి’ తరహాలోనే మరోసారి బలమైన పాత్రలో ఆమె కనిపించనుందని ట్రైలర్ సంకేతాలు ఇస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. ఇటీవల వరుసగా వచ్చిన సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోయినా, ‘కథనార్’తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈ చిత్రం విడుదలైన తర్వాత ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపిరి పోస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ప్రభాస్ స్పీడ్‌కు ఇండస్ట్రీ షాక్!

## ఒకేసారి మూడు పాన్ ఇండియా చిత్రాలతో బిజీ..



ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఒకేసారి రెండు సినిమాలు చేయడమే కష్టమైన ఈ రోజుల్లో, ప్రభాస్ ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ ‘స్పిరిట్’, ‘ఫౌజీ’, ‘కల్కి 2’ వంటి మూడు భారీ బడ్జెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా ‘ఫౌజీ’, ‘స్పిరిట్’ షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు ‘కల్కి 2’ షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రభాస్ పనితీరు ఆయన ప్రొఫెషనల్ కమిట్‌మెంట్‌ను స్పష్టంగా చూపిస్తోంది. గతంలో కూడా ‘సలార్’, ‘కల్కి 2898’, ‘ఆదిపురుష్’ వంటి సినిమాలను ఒకేసారి బ్యాలెన్స్ చేసిన అనుభవం ఆయనకు ఉంది. అయితే ఇప్పుడు పరిస్థితులు మరింత కఠినంగా ఉండటంతో ఆయనపై ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో ఉన్న చాలా మంది స్టార్ హీరోలు ఒకేసారి ఒక్క ప్రాజెక్ట్‌పైనే దృష్టి సారిస్తుంటే, ప్రభాస్ మాత్రం తన పని వేగంతో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మూడు సినిమాలను సమాంతరంగా నిర్వహిస్తూ, ప్రతి ప్రాజెక్ట్‌కు న్యాయం చేయడం ద్వారా ఆయన ప్రత్యేకతను మరోసారి నిరూపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న ఈ మల్టీ-ప్రాజెక్ట్ వర్క్ స్టైల్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకేసారి మూడు భారీ సినిమాలు చేయడం చిన్న విషయం కాదని, ఇది ఆయన అంకితభావానికి నిదర్శనమని సినీ వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

# కుర్రాళ్లను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దివ్య భారతి



ఒకే ఒక్క సినిమాతో ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిన హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. తమ అందంతో కుర్రకారుకు కిర్రెక్కించి.. డ్రీమ్ గర్ల్ అనే ట్యాగ్ ను సొంతం చేసుకున్న వారిలో దివ్య భారతి ఒకరు. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ సినిమా బ్యాచిలర్ మూవీతో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది ముద్దుగుమ్మ దివ్య భారతి.. ఈ సినిమాలో బోల్డ్ పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ముఖ్యంగా రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది ఈ సుందరి. దాంతో ఈ బ్యూటీకి కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. ఆతర్వాత ఈ అమ్మడు వరుస సినిమాలతో బిజీ అవుతుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత జీవి ప్రకాష్ తో కలిసి కింగ్ స్టన్ అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇక ఇప్పుడు తెలుగులో సినిమాలు చేస్తుంది ఈ అందాల తార. సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న గోట్ సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. కానీ ఈ సినిమా విడుదలకు మాత్రం నోచుకోవడం లేదు.. ఎప్పటినుంచో ఈ సినిమా షూటింగ్ జరుగుతూ ఉంది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో దివ్యభారతి ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గ్లామరస్ ఫోటోలతో నెటిజన్స్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది దివ్య భారతి. తాజాగా ఈ అమ్మడు వదిలిన ఫోటోలు కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్నాయి.

